నేడే గోదాం ప్రారంభోత్సవం : శివ్వాలా వెల్లడి

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : గత ప్రభుత్వంలో సరుబుజ్జిలి మండల కేంద్రంలో రైతు సౌకర్యర్థం బహుళ ప్రయోజన సౌకర్య గోదాం నిర్మించారు. అయితే ఇప్పటికి ప్రజలకు అందుబాటులో రాలేదని జులై రెండవ తారీఖు విశాలాంధ్ర కదనం ప్రచురించగా శనివారం స్థానిక ఎమ్మెల్యే, పి.యు.సి. ఛైర్మన్ కూనా రవికుమార్ చేతులమీదగా గోదాం ప్రారంభించనున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ శివాల సూర్యనారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని అన్నారు. సమస్యలు ఉంటే మాకు తెలియచేయండి మాకు సాధ్యమైనంతవరకు పరిస్కారం చేస్తామని అన్నారు. రేపటి ప్రంభోత్సవానికి మండలంలోని రైతులందరు రావాలని కోరారు.

గొట్టిపల్లి ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో తనిఖీ

మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయాలి : ఐటిడిఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర-కొత్తూరు : ఐటీడీఏ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మత్తుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కొత్తూరు మండలంలోని లబ్బ, గొట్టిపల్లి ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలలో అన్ని గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని గదులకు మరమ్మతులు చేయించాలని అన్నారు. అదే విధంగా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుపు రేషన్ కార్డుదారులను గుర్తించండి : కమిషనర్

విశాలాంధ్ర- పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో సింధూర జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా అందించే కార్యక్రమంలో భాగంగా తెలుగు రేషన్ కార్డుదారులను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ నడిపెన రామారావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయాల అడ్మిన్, కార్యదర్శులు, ఏమినిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామారావు మాట్లాడుతూ పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలలో త్రాగునీటి సరఫరా డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు ఉన్న ప్రాంతాలలో అర్హత గల అన్ని ఇండ్లకు త్రాగునీటి సరఫరా కనెక్షన్లను మంజూరు చేసేందుకు ఇంటింటికి వెళ్లి నిరుపేద కుటుంబాల తెలుపు రేషన్ కార్డుదారులను గుర్తించాలని సూచించారు. అలా గుర్తించిన వారికి తక్షణమే కులాయి కనెక్షన్లను మంజూరు చేసేందుకై చర్యలు తీసుకొనవలసిందిగా కమిషనర్ కార్యదర్శులను ఆదేశించారు. తెలుపు రేషన్ కార్డుదారులను గుర్తించి వారికి 1200 రూపాయలు డిపాజిట్ రుసుంతో కొళాయి కనెక్షన్ మంజూరుకు చర్యలు తీసుకొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ కార్యదర్శులు, ఎమినిటీ కార్యదర్శులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో కలుపు యాజమాన్య పద్ధతులు పాటించండి : ఏ.డి.ఏ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఖరీఫ్ సీజన్లో వరిలో కలుపు నివారణ యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ కె. జగన్మోహన్రావు పిలుపునిచ్చారు. గురు శుక్రవారం మండలం ఎలమంచి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యంగా వరి విత్తనాలు ముఖ్యంగా ఎద జల్లినప్పుడు ముందుగానే విత్తన శుద్ధి చేసుకుని చల్లుకోవాలని అనంతరం ఎప్పుడు ఎప్పుడు ఎరువులు ఎలా చల్లుకోవాలి ఎటువంటి మందులు పిచికారి చేయాలి అనే అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ఎదలో 18 రోజుల తర్వాత బిస్ బైరిక్ సోడియం మందును ఎకరాకు 100 ఎంఎల్ స్ప్రే చేసుకోవాలని సూచించారు. అలాగే వేరుశనగ పంటలో గొప్పుకు ముందు నాలుగు బస్తాల జిప్సం వేసుకోవాలని తెలిపారు. మెట్ట ప్రాంతాల్లో పంట మార్పిడి పైన రైతులు దృష్టి సాగించాలని, అందుకు కావలసిన సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి ఎస్. గోవిందరావు, మాజీ సర్పంచ్ ఆర్ . లీలా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

కవిటి అగ్రహారంలో పర్యటనతో మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-నందిగాం: వచ్చే ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా బస్సు ప్రయాణం కూటమి ప్రభుత్వం కల్పిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలం కవిటి అగ్రహారం, మర్లపాడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఒక్క ఏడాదిలోనే అమలు చేయడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సుపరిపాలనతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. వైకాపా పాలనలో నిలిపి వేసిన పింఛన్లను పునరుద్ధరిస్తామని అన్నారు. ఉచిత గ్యాసు, అమ్మకి వందనం, పింఛన్ల పెంపు తదితర సంక్షేమ ఫలాలను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. రూ. 10కోట్లతో టెక్కలి నియోజకవర్గంలో ఉన్న గ్రామ ప్రజలకు శుద్దతాగు నీటి జలం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎల్ నాయుడు, ఇనకాన అజయకుమార్, మళ్ల బాలకృష్ణ పోలాకి చంద్రశేఖర్, బంగారు బారికి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఐచ్చిక సెలవులు పాత పద్ధతిలోనే పాఠశాల యూనిట్‌గానే ఉండాలి

- ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఐచ్చిక సెలవులు అనేవి క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించినవి అని, సంవత్సరం మధ్యలో పాఠశాల యూనిట్‌గా ఉండాల్సిన ఐచ్చిక సెలవులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏకపక్షంగా మౌఖిక ఆదేశాలతో రద్దుచేసి వ్యక్తిగతంగా ఉపయోగించుకోమనడం సరికాదని, అటువైపు ప్రభుత్వంతోను, ఇటు ఉపాధ్యాయ సంఘాలతోనూ చర్చించకుండానే ఈమధ్య పరిపాటిగా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ఉన్నతాధికారులు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. 20 మంది ఉపాధ్యాయులు ఉన్న ఒక ఉన్నత పాఠశాలలో ఓహెచ్లు వ్యక్తిగతంగా వాడుకున్న సందర్భంలో పదిమంది ఒకేసారి సెలవు వినియోగించుకోగలరా అని ప్రశ్నించారు. ఏకోపాధ్యాయుడు అసలు ఐచ్చిక సెలవులను వినియోగించుకోగలరా, ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే ఇప్పటికి 6రోజులు ఓహెచ్ శెలవులు లున్నాయి వాటిని ఇద్దరూ ఎలా ఉపయోగించుకోగలరు అని అధికారులను ప్రశ్నించారు. సాధారణంగా వచ్చే పండగ దినాల్లోనే ఐచ్చిక శెలవులు ఇస్తుంటారని, మరి ఈ పండగ దినాలతో విద్యార్థులకు సంబంధం లేదా అన్నారు. రాష్ట్రంలో 40శాతం బడులు ఏకోపాధ్యాయులతోనే నడుస్తున్నాయని, అటువంటి సందర్భంలో ఓహెచ్లు వ్యక్తిగతంగా వాడుకోవడం సాధ్యమయ్యే పనికాదన్నారు. అధికారులు ఈ విషయంలో పునరాలోచించి మునిపటి లాగే ఓహెచ్లు పాత పద్ధతిలోనే వాడుకునేలా అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

రైతన్నలకు ఆదుకునేది ఒక్క కూటమి ప్రభుత్వమే

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్రంలో ఉన్న రైతన్నలకు ఆదుకునేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక టెక్కలి టిడిపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మామిడి, వరి, మిర్చి రైతులకు ఆదుకుందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొని పరిహారం ఇచ్చింది కూటమి ప్రభుత్వమేనని రైతులకు గుర్తు చేశారు. పొగాకు వేసిన రైతులు లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, పొగాకు కొన్ని వాళ్ళు ఎవరూ లేరని రైతులు బాధపడుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకు వస్తే దానిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో మొట్టమొదటిసారి పొగాకు 12,500 రూపాయలకు కొని రైతులకు మేలు చేశారన్నారు. చిత్తూరు జిల్లాలో తోటమామిడి అనే పంట విపరీతంగా పండిందని, 2.5 లక్షలు మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతుందని, ఈ సంవత్సరం అది బంపర్ క్రాఫ్ట్ వచ్చిందని, సుమారుగా 6.5 లక్షల మెట్రి టన్నుల ఉత్పత్తి జరిగిందని స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా చిత్తూరు జిల్లాలో మామిడి పంటలో నష్టపోతే ఏ రైతుకు కూడా ప్రభుత్వం నష్టపరిహారం అందించలేదని, కానీ 2018 లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు నష్టపరిహారం కేజీకి రెండు రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించారన్నారు. గత వైసిపి ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా ఇప్పుడు ప్రభుత్వంపై అనేక అబద్ధపు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఆ చిత్తూరు జిల్లాలో మామిడి సిండికేట్ నడుపుతున్నది వైసిపి నాయకులేనని, కొన్ని పరిశ్రమలు నడుపుతున్నది వైసిపి అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే కర్ణాటకలో ఉన్న రైతులకు 4/-రూపాయలు ప్రకటించి రైతుకు మేలు చేస్తున్న విషయం ఈ వైసిపి దుర్మార్గులు ఒకసారి తెలుసుకోవాలని విమర్శించారు. రైతులు ప్రతి ఒక్కరూ 2019 నాటి ప్రభుత్వం, నేటి 2024 ప్రభుత్వం ఒక్కసారి చూసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. రైతులకి ఎటువంటి ఇబ్బంది వచ్చినా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, కోళ్ల కామేష్, మట్ట పురుషోత్తం, టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగం, వీరత్వం యువతకు మార్గదర్శకం

ఘనంగా అల్లూరి 128వ జయంతి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: అల్లూరి సీతారామరాజు త్యాగం, వీరత్వం యువతకు మార్గదర్శకం కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతిని శ్రీకాకుళం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి కార్యక్రమాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య పోరాటంలో నిస్వార్థంగా పోరాడిన గొప్ప యోధుడని పేర్కొన్నారు. అల్లూరి స్ఫూర్తితో ప్రజల్లో దేశభక్తి భావాన్ని ప్రేరేపించేందుకు జిల్లా వ్యాప్తంగా పలువురు పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అల్లూరి చిత్ర పటానికి పుష్పాంజలులు సమర్పించి, జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ ఎం వెంకటేశ్వరరావు, డ్వామా పిడి సుధాకర్ రావు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీకాకుళం టౌన్: యువతకు స్ఫూర్తిప్రదాత "అల్లూరి సీతారామరాజు " అని, ఆయన జీవిత చరిత్రను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. స్థానిక నీలమ్మ కోలనీలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను దంతులూరి రమేష్, నల్లన మధుబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జయంతివేడుకలలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొని, అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించి

మాట్లాడుతూ మన్యంలో పోరాట వీరులను తీర్చిదిద్ది.. బ్రిటీష్ పై పోరాటం చేసి గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయన్ని పై పోరాటం మొదలు పెట్టిన అల్లూరి, స్థానికులతో కలిసి గిరిజనులపై సాగుతున్న బ్రిటీష్ అధికారుల దౌర్జన్యాలపై తిరుగుబాటు చేశారన్నారు. అల్లూరికి ప్రజల్లో ఆదరణ పెరిగి ఉద్యమ తీవ్రరూపం దాల్చిందని, పోరాటం ఉధృతంగా సాగుతున్న సమయంలో బ్రిటీష్ సైన్యానికి అల్లూరి పట్టుబడ్డారన్నారు. దేశానికి ఆయన యెనలేని సేవచేశారని, సేవల పోరాటయోధునికి స్ఫూర్తిగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఆయనవిగ్రహాలను పలు ముఖ్య కూడలిలో ప్రతిష్ఠంచటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జిలు, టీడీపీ నాయకులు, మహిళానాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నరసన్నపేట: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ వారితో పోరాడి ప్రాణాలర్పించారని, ఆయన తెగువ యువతకు స్ఫూర్తి అని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్‌లు అన్నారు. మన్యం వీరుడు అల్లూరి 128 జయంతి వేడుకలు నరసన్నపేట మండలంలో స్థానిక ఎస్సీ హాస్టల్ నందు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారు భారత దేశ ప్రజలను అనేక చిత్రహింసలకు గురి చేస్తూ, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులను బ్రిటీష్ వారు వేసే రోడ్డు పనులలో ఎలాంటి కూలి ఇవ్వకుండానే పనిచేయించుకుంటూ వారిని అనేక చిత్రహింసలకు గురి చేయడమే కాకుండా వారికి జీవితంలో భాగమైన అడవులను వారి నుంచి దూరం చేయడానికి అనేక చట్టాలు తీసుకొస్తూ గిరిజనులను చిత్రహింసలకు గురి చేస్తున్న బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు అన్నారు. గిరిజనులను ఏకతాటిపైకి తెచ్చి వారిలో ఉన్న అనేక వ్యసనాలను మాన్పించి, బ్రిటీష్ వారి పైన వీరోచితంగా పోరాడేందుకు వారికి విల్లు విద్యలు, తుపాకీ పేల్చడం లాంటి విద్యలు నేర్పించి మన్యం ప్రజలలో దేశభక్తిని రగిలించిన ఘనత అల్లూరిది అన్నారు. పరిమిత ఆయుధాలతో గెరిల్లా యుద్ధ పద్ధతిలో బ్రిటీష్ పాలకులను గడగడ లాడించి బ్రిటీష్ అధికారులకు చెప్పి మరి వారి పోలీస్ స్టేషన్లో నుండి ఆయుధలను తీసుకుపోయిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని, బ్రిటీష్ దోపిడీ నుండి ప్రజలకు స్వేచ్ఛ కల్పించాలని కాంక్షించి 27 సంవత్సరాల వయసులోనే బ్రిటీష్ ముష్కరుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని అలాంటి వీరుని ఆదర్శంగా తీసుకొని నేడు దేశంలో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా, సమాజంలో జరుగుతున్న అనేక రుగ్మతలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. అప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శ్యామ్, రాజు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో ... జిల్లా కేంద్రంలో ఉన్న స్థానిక ఎస్ టి హాస్టల్ నందు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బొత్స సంతోష్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వై వేణు, కిషోర్, రామోజీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర-టెక్కలి: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక చిన్న బజారు చేపల మార్కెట్ లో అంచనా వ్యయం రూ.49 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు, ఆధునీకరణ సముదాయాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులతో ముఖాముఖి మాట్లాడారు. ఎయే రకం చేపలు విక్రయిస్తుంది, ఎంతమేర లాభసాటిగా ఉన్నది అనే విషయాలను అడిగితెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ వసూలు చేస్తున్న ఆశీలు పై ఆరా తీశారు. ఇకపై ఆశీలు వసూలు లేకుండా చేపల మార్కెట్ దుర్గంధం, అపరిశుభ్రత ఉండకుండా పారిశుధ్య నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. చేపల మార్కెట్ ను పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

- పారదర్శకంగా దుకాణాలు కేటాయింపు... చిన్న బజార్ కిరాణా, కూరగాయల సముదాయంలోని దుకాణాలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కేటాయించాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. గతంలో దుకాణాలు నిర్వహించిన దుకాణదారుల జాబితా ప్రకారం లాటరీ ప్రాతిపదికన దుకాణాలను కేటాయించాలని సూచించారు. దుకాణాల సముదాయం ముందు ఉన్న మురుగు కాలువలు, ఫుట్ పాత్ లను నిర్మించాలని మండల ఇంజనీరింగ్ అధికారి ఎస్.ఎల్. నాయుడు ను ఆదేశించారు. సముదాయం ముందు తోపుడు బండ్లు లేకుండా వినియోగదారుల రాకపోకలకు రోడ్ విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారిని సూచించారు. పాత ఎంపిడిఓ కార్యాలయం వెనుక నిర్మించి అసంపూర్తిగా ఉన్న దుకాణాలకు వెంటనే పనులు చేపట్టి వినియోగానికి సిద్ధం చేయాలని సంబంధిత గుత్తేదారుని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణ మూర్తి, డివిజనల్ మత్స్య అధికారి ధర్మరాజు పాత్రో, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం.సురేష్, ఆర్ డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఎస్.రామ కృష్ణ, తహసిల్దార్ బి.సత్యం, ఎంపిడిఓ ఫణీంద్ర కుమార్, గ్రామ మత్స్యకార సహాయకులు, సాగర్ మిత్రలు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.

ప్రారంభం కాకముందే శిథిలావస్థకు చేరుకున్న తిలారు ఆర్ఎస్ భవనాలు

విశాలాంధ్ర-జలుమూరు : జలుమూరు మండలం తిలారురైల్వే స్టేషన్ ఆవరణలో పది సంవత్సరాల క్రితం నిర్మించిన భవనాలు ఎవరికోసమో ఎందుకోసమో ఎవరికీ అర్థం కాని ప్రశ్నార్థకంగా మిగిలింది. ప్రస్తుతం ఈ భవనాలు గీతల భారీ పిచ్చి మొక్కలతో నిండి శిధిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వం అధికార యంత్రాంగం ఏ కార్యక్రమం చేపట్టిన ముందు ఆలోచనతో చేస్తారని అటువంటిది తిలారులో లక్షలాది రూపాయలు ఖర్చుతో నిర్మించిన ఈ భవనాలు ఎవరికోసమో ఎందుకోసమో తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనాలను ఉపయోగపడే పరిస్థితులు చూడాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య వర్ధంతి

విశాలాంధ్ర-కవిటి: మహనీయుల సేవలు గుర్తు తెచ్చుకోవడం మన ధర్మం అని ప్రిన్సిపాల్ బిందు మాధవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి లో గల కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పింగళి వెంకయ్య వర్ధంతిని విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బిందు మాధవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏవో రాణి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బిందు మాధవి మాట్లాడుతూ పింగళి వెంకయ్య జీవితం అతను రూపొందించిన జాతీయ పతాకం ఏ సందర్భంలో తయారు చేయవలసి వచ్చింది. ఎప్పుడు ఎగరవేశారు దానికి ఉన్నటువంటి రంగులు చక్రం యొక్క వివరాలు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

విశాలాంధ్ర-కవిటి: బొరివంక పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్యం పనులను ఎంపీడీవో ఎల్.త్రినాధ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు తడి,పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రానికి తరలించాలని కోరారు.ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ వ్యాధుల కాలం అంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ (డిప్యూటీ ఎంపీడీవో) అబ్దుల్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి ఎన్.గుణవతి,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

గోడ పత్రికను ఆవిష్కరించిన మంత్రి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్ర ప్రభుత్వాలు విస్తారంగా అమలు చేస్తున్నందున ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చనాయుడు పిలుపునిచ్చారు. నిమ్మాడలొ తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సంబంధిత గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ప్రధాన ఉద్దేశం తుఫాను, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించేందుకు దోహదపడుతుంద న్నారు. ఈ పంట బీమా పథకం ద్వారా నష్టాన్ని అంచనా వేసి సాగు చేసిన రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపజేసి పరిహారం అందించ నున్నట్లు తెలిపారు. ప్రధానంగా జిల్లాలో వరి, మొక్కజొన్న పంటలకు భీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద రైతులకు సహజ ఉత్పత్తుల నుండి రక్షణ కల్పించేందుకు, రైతులకు ఆర్థిక భరోసా అందివ్వనున్నట్లు తెలిపారు. రైతులు తక్కువ ప్రీమియం చెల్లించి అధిక బీమా పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ. కే.జగన్మోహన్రావు, స్థానిక వ్యవసాయ అధికారి ఎస్. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 13 మేకలు మృతి

విశాలాంధ్ర -కోటబొమ్మాళి: మండలం దుప్పలపాడు గ్రామంలో గురువారం రాత్రి వీధి కుక్కల దాడిలో 13 మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన సబ్బి లక్ష్మణరావు, బి.సింగి కి చెందిన 13 మేకపిల్లలు మృతి చెందాయి. గ్రామం చివర మందగ పడుకొని ఉన్న సమయంలో కుక్కలు దాడి చేశాయని, ఈ దాడిలో 10 మేకపిల్లలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో మూడు మేకలు కు తీవ్రంగా గాయాలు అయ్యాయని కాపర్లు తెలిపారు. 80 మేకలు ఉండగా మిగతా అన్ని పారిపోయాయని ఈ 13 పిల్లలు పరిగెత్త లేక కుక్కలకు దొరికిపోయాయని బాధితులు తెలిపారు.

ఐతమ్ కళాశాలకు రూ.15లక్షలు నిధులు మంజూరు

విశాలాంధ్ర-టెక్కలి : ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న ఇంక్యూబెసన్ సెంటర్ ద్వారా తక్కువ ఖర్చుతో కూడిన ఆటోమేటెడ్ బ్యాటరీ ఛార్జింగ్ సిస్టమ్ ఫర్ ఈ-వెహికల్స్ అనే ఐడియాను విద్యార్థి కేటగిరీ కింద ప్రోటోటైట్‌గా పెంపొందించడం మరియు అభివృద్ధి చేయడం కోసం ఏంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 4.0 కింద ఐతమ్ ఇంక్యుబేషన్ సెంటర్‌కు 15 లక్షలు రూపాయలు మంజూరు చేసిందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఐతమ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు తెలిపారు. ఈ వినూత్నప్రయోగాని మెన్టర్గా అధ్యాపకులు డాక్టర్ జి. సతీష్ కుమార్, డాక్టర్ పల్లి. శ్రీహరి, ముఖ్య మెన్టర్గా మరియు ముఖ్య సమన్వయ కర్తగా ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి ప్రోత్సాహంతో విద్యార్థులు రత్నాల అలేఖ్య ఈసీఈ విభాగం నాల్గవ సంవత్సరం,సాధు ఉమా చంద్రసాయి ఈసీఈ నాల్గవ సంవత్సరం, యూన ప్రవలిక మూడవ సంవత్సరం ఈసీఈ, కొండాల దిలీప్ కుమార్ ఈసీఈ మూడవ సంవత్సరం, ఎ జ్యోష్ణ మెకానికల్ మూడవ సంవత్సరం, ఎం నిరంజన్ ఈఈఈ లకు ఐతమ్ డైరెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు తోపాటు కళాశాల ప్రిన్సిపాల్ ఎఎస్ శ్రీనివాసరావు, ఈఈఈ హెచ్వోడి డాక్టర్ విజయ్ కుమార్, ఈసీఈ హెచ్వోడి డాక్టర్ అశోక్, మెకానికల్ హెచ్వోడి పి.శ్రీహరి పాల్గొన్నారు.

రేఖా సంఖ్య నెం.49/2020ఏ, తే.02.07.2025.ది మండల ప్రజా పరిషత్, కోటబొమ్మాళి.

బహిరంగ వేలం ప్రకటన

రాజపత్రం క్రమ సంఖ్య 15, తే:14.02.2025ది

వేలం వేసే ఆఫీసర్ పేరు :- కోటబొమ్మాళి మండల పరిషత్ అభివృద్ధి అధికారి లేక వారి అధికారము పొందిన ఆఫీసరు

వేలం జరుపు స్థలం :- కోటబొమ్మాళి, మండల ప్రజా పరిషత్ కార్యాలయము

సమయం/తేది :- తే 10.07.2025.ది. గురువారం ఉదయం గం. 11.00 లకు, 2025-26 ఆర్థిక సంవత్సరము నందు తే:10.07.2025.ది నుండి తే:31.03.2026 వరకు నారాయణవలస వారపు (గురువారం) సంతలు యొక్క సంతలో ఆశీలు వసూలు చేసుకొనే హక్కులను బహిరంగ వేలం వేయుటకు పత్రికా ప్రకటన చేయడమైనది.

షెడ్యూలు

వరుస సంఖ్య	వేలం వేయబడు స్థలం	హద్దులు	సర్వే నెం.	సుమారు విస్తీర్ణం	ధరావత్తు పైకం
1.	నారాయణవలస గురువారం సంతలో 2025-26 ఆర్థిక సం॥నకు ఆశీలు వసూలు చేసుకునే హక్కు	ఉ. సర్వే నెం.	171-బి ఎ5-24	6.32 ఎకరాలు	రూ. 10,00,000 (పది లక్షలు)
		ద. సర్వే నెం.	16 ఎ		
		తూ. సర్వే నెం.	321-1-03		
		ప. సర్వే నెం.	173-274-111ఎ		

షరతులు:- 1) నారాయణవలస సంత పాటదారులు షెడ్యూల్ ధర మొత్తం రూ.5000/-లు మరియు డిపోజిట్టు మొత్తం రూ. 10,00,000/-లు, యస్.బి.ఐ. కోటబొమ్మాళిలో చెల్లుబాటు అయ్యే విధంగా మండల పరిషత్తు సాధారణ నిధులకు చలానా ద్వారా గాని, మండల పరిషత్తు అధికారి పేర బ్యాంకు డ్రాఫ్ట్ ద్వారా గాని చెల్లించవలెను.

2) హెచ్చుపాటదారులు ఖాయపరచిన గుత్తమొత్తములో సగభాగము తక్షణమే ఈ కార్యాలయమునకు చెల్లించి గుత్తహక్కును పొందవలయును. తదుపరి సగభాగమునకు కౌలుదారులు తన స్వంత చెక్కులను యం.పి.డి.ఓ. కోటబొమ్మాళి వారి పేరున సమర్పించవలసి యుండును.

3) వేలంపాటు జరిపిన మండల పరిషత్తు అభివృద్ధి అధికారి, కోటబొమ్మాళి వారిచే విధించబడిన యితర షరతులకు లోబడి పాటదారులు పాటలో పాల్గొనవలెను, మరియు పాటలో హెచ్చు పాటదారులు సదరు షరతులు అన్నింటినీ ఒప్పుకున్నట్లు రూ.300/-లు నాన్ జుడీషియల్ స్టాంపుపై అంగీకార పత్రము ఈ కార్యాలయమునకు సమర్పించవలసి యుండును.

4) వేలంపాటలో పాల్గొన్న పాటదారులు రూ. 8,00,000/-లకు మించిన విలువ కలిగిన రెవిన్యూ డిపార్ట్మెంటు వారిచే జారీ కాబడిన ధృవపత్రముతో హాజరుకావలసియుండును.

5. పాట ఖాయపరచిన తదుపరి వేలంపాటదారులు తనకు రూ. 8,00,000/-లకు మించిన విలువ కలిగిన రెవిన్యూ డిపార్ట్మెంటు వారిచే జారీ కాబడిన ధృవపత్రములు కలిగిన ఇద్దరు పూచీదారులచే వ్రాత పూర్వకమైన హామీని కార్యాలయమునకు సమర్పించిన తదుపరి పాటదారుని పేరును ఖరారుపర్చబడును.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి.
మండల ప్రజా పరిషత్, కోటబొమ్మాళి

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపి, సమస్యల పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే గుండు శంకర్ దృష్టికి కార్మికుల సమస్యలను ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తీసుకువెళ్లారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి. తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి. అప్పలరాజు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేయాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని, పర్మినెంట్ కార్మికులకు ఆరు డిఏలు, సరెండర్ లీవ్ లు, వెంటనే విడుదల చేయాలని, శ్రీకాకుళం నగరపాలక సంస్థ విస్తీర్ణం అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, స్థానిక సంస్థలపై కార్మిక సంఘాలతో చర్చలు జరిపి ఒక్కో సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అనంతరం శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీగా చేరుకొని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గారి వ్యక్తిగత సహాయకులు సత్యనారాయణకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు జె. గురుమూర్తి, పార్థసారథి, గణేష్, మనీ, రామచంద్ర, సోగ్గాడు, సూర్య కళ, సరస్వతి, కూర్మారావ్ సోషల్ మీడియా ప్రతినిధులు కళ్యాణి. తిరుమల రావు, అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అనుమతితోనే బంద్‌లు, నిరసనలు నిర్వహించాలి...

- టౌన్ డీఎస్పీ సి. హెచ్. వివేకానంద

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం:. శ్రీకాకుళం టౌన్ సబ్ డివిజన్ పరిధిలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు,బంద్ లు నిర్వహించాలన్న సంబంధిత పోలీసు వారి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సి. హెచ్.వివేకానంద తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ పత్రిక ప్రకటన జారీ చేశారు. శాంతి భద్రతలు పరిరక్షణలో బాగంగా శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్, ధర్నాలు నిర్వహించాలనుకునే రాజకీయ పార్టీలు వారు, మత సంస్థలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, మరే ఇతర సంఘాల వారు ఒక వారం రోజుల ముందుగా ఆ ప్రాంత పరిధిలో పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్.ఓ వద్ద పోలీస్ వారు నిర్దేశించిన అనుమతులను ముందుస్తుగా తప్పనిసరిగా ఉండాలని డిఎస్పీ తెలిపారు.అదేవిధంగా వాటికి దరఖాస్తు చేసుకునే వ్యక్తుల వివరాలు, ఎందుకు నిర్వహిస్తున్నారు,ఎంతమంది వస్తున్నారు. ప్రారంభ సమయం, ముగింపు సమయం, రూట్, స్థలం ఇలా పలు వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ముందస్తుగా సంబంధిత పోలీస్ అధికారు లకు అర్జీ చేసుకొని అనంతరం ఖచ్చితంగా తన నుంచి ఎస్ డి పి ఓ అధికారి నుండి అనుమతిని పొందాలని అన్నారు. కార్యక్రమం తేదీ, సమయం, ప్రదేశం, ప్రదేశం యొక్క యజమాని అనుమతి పత్రం, ప్రదేశం వద్ద తీసుకునే భద్రత ఏర్పాట్లు, హాజరయ్యే ప్రజల సంఖ్య, వారికి ఏవైనా రవాణా, వాహనాలు సంఖ్య,భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తే వాటి వివరాలు తెలిపాలనిన్నారు. ఎటువంటి మైకులు, డీజే బాక్సులు వంటివి పెడుతుంటే వాటి వివరాలు తెలిపి, శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలను, ఉపన్యాసాలను, హింసాత్మక పోస్టర్లను ప్రదర్శించడం వంటివి చేయరని రాతపూర్వక హామీ ఇవ్వాలన్నారు.

కేంద్ర మంత్రి స్వార్థం, ఎమ్మెల్యే చేతకానితనం!

- ఫలితం ఆమదాలవలస రైల్వే గూడ్స్ షెడ్ తరలింపు..

- నియోజకవర్గ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వా ర్థం అలాగే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికు మార్ చేతకానితనం ఫలితంగా ఆమదాలవలస రైల్వే గూడ్స్ షెడ్ హరిశ్చంద్ర పురం కి తరలి వెళ్ళి పోబోతోందని నియోజకవర్గ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వ యకర్త చింతాడ రవికుమార్ అన్నారు. వైసీపీ నియో జకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చింతాడ రవికుమార్ మాట్లాడుతూ రైల్వే గూడ్స్ షెడ్ పై ఆధారపడి 11 గ్రామాలకు చెందిన దాదాపు వెయ్యి కుటుంబాలు తరాలుగా జీవనం సాగిస్తున్నారని, ఆమదాలవలస లో మిగిలిన ఏకైక జీవనోపాధిని కూడా ఇప్పుడు కేంద్రమంత్రి తన కు టుంబ స్వార్థం కోసం తరలించుకు పోతుంటే, చేత కాని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ చోద్యం చూస్తూ ఇసుక అమ్ము కుంటున్నాడని ఆరో పించారు. ఇప్పటికే కుటుంబ పాలనతో అన్నివిధా లుగా నష్టపోయిన ఆమదాలవలస ఇప్పుడు ఈ ఉపాధి కూడా పోతుండంతో ప్రజలకు వలస పోవడం మినహా వేరే గత్యంతరం లేదని దీనికి నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎంపీ, ఎమ్మెల్యే లు బాధ్యత వహించాలని చింతాడ రవికుమార్ తెలిపారు. మొద్దునిద్ర లో ఉన్న కూన రవికుమార్ ఇప్ప టికైనా మేల్కొని కేంద్ర మంత్రిని నిలదీసి గూడ్స్ షెడ్ ఆమదాలవలస నుండి తరలిపోకుండా తగు చర్య లు తీసుకోవాలని లేదంటే ప్రజా ఉద్యమం తప్పదని చింతాడ రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో ఆమదాలవలస పట్టణ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, పొందూరు వైస్ ఎంపీపీ ప్రతినిధి వండాన సురపునాయుడు, వైసీపీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, కొత్తవలస పంచా యతీ వైస్ సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, సీర హరి, రాము, శ్రీరామ్, చిన్నబాబు, శ్రీను, గిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాస్టల్ సీట్లు మంజూరు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి అధ్యక్షులు తలసముద్రం సూర్యం

విశాలాంధ్ర-టెక్కలి: టెక్కలి మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థిని విద్యార్థులకు హాస్టల్ సీట్లు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి అధ్యక్షులు తలసముద్రం సూర్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలో వివిధ కళాశాలలో శుక్రవారం విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ త్రినాధరావుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని విద్యార్థులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సూర్యం మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలలో వివిధ ప్రాంతాల నుండి వందలాది మంది విద్యార్థులు చదువు కోసం ఇక్కడికి వస్తున్నారని, కళాశాలలు తెరిచి నెలలు గడుస్తున్నప్పటికీ స్థానిక బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో సీట్లు కోసం దరఖాస్తు చేసుకునే నెలలు గడుస్తున్నప్పటికీ సీట్లు మంజూరు చెయ్యకపోవడం సరికాదని వాపోయారు. చదువు కోసం దూర ప్రాంతాల నుండి వచ్చిన పేద విద్యార్థిని విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడం చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మానవ వనరుల అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఇది దృష్టిలో పెట్టుకుని తక్షణమే విద్యార్థులకు సీట్లు మంజూరు చేసి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తారని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పి సోనియా, కే జోష్నా, టి జోస్నా, వి రజిత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర-ఆమదాలవలస: సైబర్ మోసాల పట్ల బ్యాంక్ ఖాతాదారులు అప్రమ త్తంగా ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. ఆమదాలవలస మండలం పొన్నాంపేట గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వ ర్యంలో జిల్లా గ్రామ స్థాయి జన సురక్ష ఫైనాన్షియల్ ఇన్ క్లూజన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 1నుంచి సెప్టెంబర్ 30 వరకు జరుగు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు కోసం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వ హించడం జరుగుతుందన్నారు. సైబర్ మోసల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేయాలని సూచిం చారు. అటల్ పెన్షన్ యోజన పథకం18 సంవత్స రాల నుండి 40 సంవత్సరాలు ఉన్న వ్యక్తులు కొంత నగదును బ్యాంకుల్లో దాచుకున్నట్లయితే వృద్ధాప్యం లో బ్యాంకుల ద్వారా 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తులకు పెన్షన్ రూ. 1000 నుండి 5000 వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇన్సూరెన్స్ ల కోసం బ్యాంక్ ఇంటిగ్రేడ్ అంబుడ్స్ మాన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలనీ సూచించారు. ఏటిఎం కార్డ్స్ వల్ల కలిగే ఉపయోగా లను వివరించారు. బ్యాంకుల వద్ద ఇబ్బందులు పడకుండా సులువుగా నగదును ఏటీఎం ద్వారా డ్రా చేసుకోవచ్చునని తెలియజేశారు. ఏటీఎం నుంచి నగదు విత్ డ్రా చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఖాతాదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస యూనియన్ బ్యాంకు మేనేజర్ రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ కె.ఉమ శంకర్, ఆమదాలవలస వెలుగు ఏపీఎం నారాయ ణరావు, జిల్లా లీడ్ బ్యాంకు ఎఫ్ ఎల్ సి సువ్వారి రవి బాబు, సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్ సిహెచ్.వెంకటేష్, పొన్నంపేట సీఎం గాయత్రి, సిఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృష్ణవతారంలో జగన్నాథ స్వామి దర్శనం

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న శ్రీశ్రీశ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని కృష్ణవతారంలో అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. పరిసర ప్రాంతాలలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించు కున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారిని టివి మనస్వి, దేవాదాయ శాఖ సిబ్బంది, అర్చకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - మందస : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిందని టీడీపీ మండలాధ్యక్షులు బావన దుర్యోధన, క్లస్టర్ ఇన్‌చార్జీ కొర్ల కన్నారావులు అన్నారు. శుక్రవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలో చిపి గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యాలయాలను వివరించారు. కార్యక్రమంలో దేబాశిష్ పండా, దట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, మంగళ పాత్రో, ఎం.చంద్రశేఖర్, గార వెంకటరావు, జగదీష్, నరేష్, సవర రఘు, మార్పు రవి, జి.దుర్యోధనలు పాల్గొన్నారు. అలాగే మండలంలో దున్నవూరు పంచాయితీ గెడ్డూరులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జీ దాసరి తాతారావు, చౌదరి మురళీ, క్రిష్ణ, కుప్పిలి వెంకటరావు, మోహన్, శేషయ్య, షన్ముఖరావులు పాల్గొన్నారు.

మహిళల చేతిలో పాశుపాతాస్త్రం శక్తి యాప్

విశాలాంధ్ర-సోంపేట: ప్రభుత్వం రూపొందించిన మహిళల రక్షణకు సంబంధించిన శక్తి యాప్ వారి చేతిలో పాశు పతాస్త్రమని సోంపేట సీఐ మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని సంస్కారభారతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళల రక్షణపై డ్రగ్స్ వినియోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్సై లోవరాజుతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ పలు విషయాలు వివరించారు. ప్రతి మహిళ తనకు అందుబాటులో ఉన్న స్మార్ట్ ఫోన్‌లో తప్పనిసరిగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు యాప్‌లో ఉన్న ఎస్ఓఎస్ ఆప్షన్ నొక్కాలి. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటారు. మహిళలకు భద్రత కల్పిస్తారు. అలాగే విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోను మత్తు పదార్థాలకు దగ్గర కావద్దని సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వై.దేవరాజు, కరస్పాండెంట్, సెక్రటరీ డాక్టర్ నిమ్మన దాసు, ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి, ఏఓ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 అంశంపై సీఎం వీడియో కాన్ఫెరెన్స్



విశాలాంధ్ర -రణస్థలం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ రణస్థలం మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫెరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 అంశంపై ఎచ్చెర్ల అసెంబ్లీ లో పి4 మార్గదర్శి బంగారు కుటుంబం పై వస్తున్న స్పందన, తీసుకుంటున్న మార్గదర్శకాలపై వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెబుతూ ఈ అంశం పై ఎమ్మెల్యే లకు పాయింట్స్ మరియు ర్యాంక్ లు ఇవ్వడం జరుగుతుందని, ఒక విజన్ తో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుగుణాకర్ రావు, ఎంపీడీవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2025-26 ఖరీఫ్ సీజన్ సంబంధించి ఇన్స్యూరెన్స్ ప్రీమియం : ఏఓ



విశాలాంధ్ర-ఆమదాలవలస: ఖరీఫ్ సీజన్లో రైతులు 2025 -26 సంవత్సరానికి గాను ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపుల్లో అవకాశం ప్రభుత్వం కల్పించిందని వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు తెలిపారు. 160 రూపాయలు బీమా ప్రీమియం చెల్లిస్తే 40 వేల రూపాయలు వరకు భీమ వర్తిస్తుందని వివరించారు. వరి కి ఒక ఎకరానికి 160 రూపాయలు చెల్లిస్తే రూ.40వేలు వరకు బీమా పొందుతారు. వరిపంట కి 15 ఆగస్టు 2025 లోపు ఇన్స్యూరెన్స్ తీసుకోవాలన్నారు. మొక్కజొన్న కి ఒక ఎకరానికి 66 రూపాయలు చెల్లిస్తే 33వేల వరకు బీమా పొందవచ్చు. దీనికి 31 జూలై 2025 తేదీ లోపు ఇన్స్యూరెన్స్ తీసుకోవాలి. మీసేవ లో, సి ఎస్‌సి లో, బ్యాంక్ లో, సచివాలయం లో డిజిటల్ అసిస్టెంట్ దగ్గర ఇన్స్యూ రెన్స్ చెల్లించి రసీదు పొందవచ్చు. బ్యాంక్ ద్వారా పంట రుణాలు తీసుకొనే రైతులకు తెలియజేసి వారు పంట కి ఇన్స్యూరెన్స్ తీసుకొనేలా చూలనిబ్యాంకర్లను కోరారు.

పాతపట్నం నియోజకవర్గం విజన్ ఏ 2047 సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ఎంజిఆర్



విశాలాంధ్ర -హిరమండలం/ పాతపట్నం: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రూపొందు తున్న విజన్ ఏ2047 కార్యక్రమంలో భాగంగా, స్వర్ణాంధ్ర పీ4 అభివృద్ధి ప్రణాళికలపై పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు అధ్యక్షతన శాసనసభ్యులు కార్యాలయం లో గూగుల్ మీట్ సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించబడింది. సమావేశంలో ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు పర్యావరణ పరిరక్షణ సమగ్ర అభివృద్ధి వంటి కీలక రంగాలపై విస్తృతంగా చర్చించగా ఆయా రంగాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు కోసం కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు పాతపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడమే మన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పి సీఈఓ ఎల్ ఎన్ వి శ్రీధర్ రాజా ఐదు మండలాల ఎం ఆర్ ఓ లు, ఎంపీడీఓలు, ఏ ఓ లు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/ క్రైం: నేర నియంత్రణ మరియు అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టే చర్యలు లో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు శ్రీకాకుళం పట్టణ పరిధిలో శ్రీకాకుళం రెండువ పట్టణ పోలీసు స్టేషన్ సీఐ ఈశ్వరావు తన సిబ్బందితో చౌదరీ సత్యనారాయణ కాలనీ లోని తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి విస్తృతంగా పోలీసులు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో గంజాయి, మద్యం, నాటు సారా నిషేధిత పదార్థాలు, అక్రమ నిల్వలు పై సోదాలు చేసి, అపరిచిత, అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలను చేపట్టి, అణువణువు క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులను విచారించి, పాత నేరస్థులు ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జె ఆర్ పురం, పొందూరు పోలీసు స్టేషన్ పోలీసులు వారి పరిధిలోని పలు గ్రామాల్లో తెల్లవారుజామున కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.అనధికార,సరైన వాహన పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలను, జె.ఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్నారు.

వికసిత్ భారత్ నిర్మాణానికి అందరూ సహకరించాలి

- ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎన్ ఈ ఆర్

విశాలాంధ్ర-రణస్థలం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి ఆలోచనతో చేపట్టనున్న వికసిత్ భారత్ 2047 నిజంతో ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమానికి అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే శాసనసభ్యులు నడుగుదుటి ఈశ్వరరావు ఎన్ ఈ ఆర్ సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వికసిత్ భరత్ 2047 స్వర్ణాంధ్ర-2047 ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సుగుణాకర్ రావు అధికారులు డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గురజాపు రాము, అన్నెపు భువనేశ్వరరావు మరియు కూటమి నాయకులు ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు, జగన్నాథం నాయుడు, డిజిఎం ఆనందరావు, విన్నింటి బానోజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

విశాలాంధ్ర -కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని, బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ప్రచారం చేయాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ కింజరాపు. రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ముత్యాలపేట జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఎన్రోల్మెంటు డ్రైవ్ కోసం ఉపాధ్యాయులతో చరించారు. మోడల్ ప్రైమరీ బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.బడి ఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జల్లు విజయలక్ష్మి, హారిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎం.గోవి, కృష్ణ, నాగేశ్వరరావు, సింహాచలం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో సేవలందించాలి

విశాలాంధ్ర-కవిటి: ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో సేవలందించాలని రిజర్వు బ్యాంక్ డీజీఎం జగదీష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కవిటి సీహెచ్సీని సందర్శించారు. ఈ సందర్భంగా కిడ్నీ రోగులు, సాధారణ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పండ్లు, గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రాంజీ, ఆసుపత్రి కమిటి సభ్యులు పాండవ. చంద్రశేఖర్, ఆరంగి. మధు, క్రిష్ణారావు, రాజు, రుద్రయ్య, బాలభాస్కర్, శ్రీధర్ ఉషోదయ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతులు థైలేరియోసిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పాడి రైతులు థైలేరియాసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మందా లోకనాథం అన్నారు. శుక్రవారం మండలం కురుడు పంచాయతీలో 50 పశువులకు సంబంధిత టీకాలను వేయడం జరిగిందని తెలిపారు. అయితే ఈ వ్యాధి బాహ్య పరాన్న జీవులైన పిడుదులు (కొనుసులు) ద్వారా థైలేర్యో అన్యులేటర్ అను ప్రోటోజీవన్ క్రిమి వలన ఎక్కువగా మేలు రకాలైన సంకరజాతి పశువులలో వస్తుందని 105 ం106 డిగ్రీల వరకు జ్వరం, గ్రంధులు రక్తహీనత వంటి లక్షణాలతో చనిపోతాయని తెలిపారు. దీనికి రక్షా బ్యాక్ ం టి అను టీకాను వేయడం జరుగుతుందని తెలిపారు. అయితే లక్షణాలను బట్టి రైతులు గుర్తించి త్వరితగతిన దగ్గరలో ఉన్న పశువైద్యశాలకు తీసుకురావాలని, లేదా వైద్యులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే ఆవులలో ఉచిత సామూహిక నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగిందని ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర -టెక్కలి : ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని స్టేషన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్ర పరిధిలో ఉన్న నౌపడ రైల్వే స్టేషన్ లో చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ వినేష్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టేషన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు, స్టేషన్ సూపర్డెంట్ సమక్షంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎటువంటి అవసరాలు, సౌకర్యాలు కల్పించాలని చర్చించారు. అనంతరం గత సమావేశంలో ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలపై చర్చించిన విధంగా త్రాగునీటి సదుపాయం, ట్రైన్ నిలుపుదల చేసినప్పుడు కోచ్ నెంబర్స్ తెలిపే డిజిటల్ బోర్డ్స్, ప్రయాణికులు ఉండడానికి సరిపడా అన్ని ఫ్లాట్ ఫామ్ లో షెల్టర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని చర్చించుకున్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా నౌపడ రైల్వే స్టేషన్ కి కేటాయించిన సుమారు 22 కోట్ల నిధులతో అధునాతన నూతన రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలించి, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో నౌపడ స్టేషన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు బూరె నరేంద్ర చక్రవర్తి, నడుపురీ లక్ష్మీనారాయణ, గూన మీనా కుమార్, శాసన పూరి శ్రీను, కొండల జగన్నాథం, స్టేషన్ సూపర్డెంట్ ఆనంద్ చరణ్ సాహూ, పాల్గొన్నారు.

విత్తన గుళికలతో చీడపీడలు దూరం

విశాలాంధ్ర-కవిటి: విత్తన గుళికలను వాతావరణంకు అనుకూలంగా వరుస క్రమంలో వేసుకోవడం వలన సూర్యరశ్మి,గాలి నేరుగా భూమిపైకి తాకి కిరణాలు విస్తరింప చేస్తాయని ప్రకృతి వ్యవసాయ ఎంటీ సంజీవరావు, డిఎంఎంటీ తులసయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం గొర్రెపాడు యూనిటు ఖాజూరులో విత్తన గుళికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని వలన ఎటువంటి చీడపీడలు, తెగుళ్ల రాకుండా ఉంటాయని అన్నారు. ఈ పద్ధతిలో నాణ్యమైన దిగుబడులు వస్తాయని, రైతులకు ఖర్చులు తగ్గుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్ టు చిట్టిబాబు,ఐసీఆర్పిలు స్వాతి,సంతోషి, రైతులు, స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సామాజిక శాస్త్ర కోర్సుల బలోపేతానికి ప్రాధాన్యం : వీసీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: సామాజిక శాస్త్ర కోర్సుల బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) సంయుక్త సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంజనీరింగ్, తదితర కోర్సుల్లో క్వాంటమ్ సంబంధిత కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. నైతిక విలువలు, భారతీయ వైజ్ఞానిక విధానం, స్వయం మూక్స్ వంటివి యూజీ, పీజీ స్థాయిలో ఒక సబ్జెక్ట్ గా అమలుచేస్తూ, వాటికి క్రెడిట్స్ ఇస్తామన్నారు. ఇటీవల విడుదలైన పీఎం ఉషా నిధులు వర్సిటీ ప్రగతికి, విభాగాల బలోపేతానికి వినియోగిస్తామన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత మాట్లాడుతూ వర్సిటీ తీసుకువచ్చే విద్యా రం గమార్పులు, నూతన అంశాలను మాతృసంస్థ అయిన ఏయూ నుంచి ఎక్కువగా తీసుకుంటామని చెప్పారు. వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ సీహెచ్. రాజశేఖర్, అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని మాట్లాడుతూ పీజీ ప్రవేశాలపై తీవ్ర ప్రభావాన్ని చూపే డిగ్రీలో సింగిల్ మేజర్ విధానానికి ప్రత్యామ్నాయ మార్గాలు అవలంబించాల్సిఉందన్నారు. నూతన విద్యా విధానం, ఉన్నత విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యూజీ, పీజీ కోర్సుల్లో నూతన బోధనా అంశాలు ప్రవేశపెట్టాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో బీవోఎస్ చైర్మన్లు జె.రవి, పి. అర్జున్, సీహెచ్. మంజులత, యోహనబాబు, పి. జగదీశ్వరరావు, జి.గిరిజా శంకర్, టి.కామరాజు, పి.చిరంజీవులు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

విశాలాంధ్ర -పలాస: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపిడిఓ వసంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం పలాస మండల పరిషత్ కార్యాలయంలో పలాస, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు సంబంధించిన మహిళా సర్పంచులకు అవగాహన కల్పించేందుకు డి ఆర్ పి లు జ్యోతి శ్రీనివాస్, కామరాజు, ఎన్ మన్మధరావు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ వసంత కుమార్ మాట్లాడుతూ పలాస డివిజన్ లో ఉన్న మహిళా సర్పంచ్ లకు ఒకొక్క నియోజక వర్గానికి మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గ్రామస్థాయిలో మహిళా సర్పంచులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని గ్రామాల అభివద్ధిలో కీలక భూమిక పోషించేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. గ్రామాలలో అభివద్ధికి మహిళా సర్పంచులు నిర్వహించాల్సిన బాధ్యతలు, విధుల గురించి ట్రైనింగ్ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ మెట్ట వైకుంఠ రావు, ఎఓ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ మన్మధరావు, డి పి ఆర్ సి కోఆర్డినేటర్ పేరాడ ఆనందరావు, పలాస ,నందిగాం, మెళియాపుట్టి మండల సర్పంచ్ లు పాల్గొన్నారు.

మానవత్వంతో రక్తదానం

విశాలాంధ్ర-పలాస: తలసేమియాతో బాధపడుతున్న బాలుడికి పూజ అనే మహిళ శుక్రవారం రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యుల సహకారంతో జస్వంత్ అనే బాబు కోసం రక్తాన్ని సేకరిస్తున్నారు. అందులో భాగంగా ఆ ట్రస్ట్ కు చెందిన టెక్కలి మండలం బొప్పాయిపురం గ్రామానికి చెందిన పూజ ఏబీ పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. పసి ప్రాణం కాపాడుకునేందుకు మానవత్వంతో ఇప్పటికే ఎంతో మంది దాతలు ముందుకు వస్తున్నారని మహిళలు కూడా రక్తదానంకు ముందుకు వస్తున్నారని ఆ ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

విశాలాంధ్ర-పలాస: విప్లవ జ్యోతి, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శప్రాయమైనదని, ఆయన వీరోచితంగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ప్రత్యేకంగా మన్యం ప్రాంత గిరిజనులను బానిస జీవితం నుండి విముక్తి చేయాలనే సంకల్పంతో విప్లవ మార్గాన్ని ఎంచుకొని ఆయన ప్రాణ త్యాగం గిరిజనుల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం అంకితం అయిందని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి డా. పి. మధు మాట్లాడుతూ, అల్లూరి పోరాటం కేవలం భౌతికంగా కాకుండా ఆత్మబలంతో కూడినదని, ఆయన జీవితం నేటి విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిచ్చే మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి తన జీవితంలో ఎదురయ్యే అన్యాయాలకు అల్లూరి మార్గంలో నిలిచి ఎదురు చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి , ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పివి రమణ, శ్రీనివాస పట్నాయక్ , అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: భావితరాల మార్గ దర్శకుడు మన్యం వీరుడు అల్లూరి అని బిజెపి నాయకులు కొనియాడారు. మండలంలోని స్థానిక అయ్యప్ప నగర్ లో బిజెపి నాయకులు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ కౌన్సిల్ మెంబర్ జన్ని పరమేశ్వరరావు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు, మన్యంపులి, విదేశీయుల గుండెల్లో నిద్రపోయిన వీరయోధుడు నాటి నేటి భావితరాల మార్గ దర్శకుడు అల్లూరి సీతారామరాజని పేర్కొన్నారు. యువతరానికి స్ఫూర్తిదాయకులు అల్లూరి సీతారామరాజు అని, భవిష్యత్తు తరాలకు ఆయన జీవిత చరిత్ర ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్యార్థులు అతని స్ఫూర్తితో ముందుకెళ్లి దేశభక్తిని చాటుతూ భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందే విధంగా విద్యార్థులు తమ వంతు క్రియాశీల పాత్ర వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చ జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నడుపు లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి శాసనపురి శ్రీను, ఉపాధ్యక్షులు సంపత్ రావు రమేష్, మండల ఉపాధ్యక్షులు పినమెంటు ఉమాబాబు, మల్లేశ్వర్ రెడ్డి మరియు గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి : అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి

చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గోవిందమ్మ అన్నారు. మండలంలోని స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు స్వార్ధాన్ని విడిచి సామాజిక సేవలో పాల్గొనాలని సూచించారు. అల్లూరి త్యాగం నేటి యువత కర్తవ్యం అనీ, సమ సమాజం స్థాపించాలని అల్లూరి భగత్ సింగ్ పోరాడారని ఆ క్రమంలో వారి జీవితాలనే అర్పించారని కొనియాడారు. అల్లూరి మొగల్లులో జన్మించి గిరిజనులను చైతన్యవంతులను చేసి గిరిజనోద్యమాన్ని నిర్మించారన్నారు. అటువంటి మహనీయుల జీవితాలలో నేటి విద్యార్థులకు యువతులకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఓ. కోటీశ్వరరావు, కె. శ్రీనివాసులు, డీఆర్. వైవిసి హెచ్ లీలా పద్మజ, త్రినాథరావు, ధర్మారావు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: మన్యం వీరుడు, పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని కవిటి మండలంలో వలు పాఠశాలలు, కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. సింహాచలం నాయుడు చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మన్యం ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చి, వారిని ఏకం చేసి, బ్రిటిష్ వారిని గడగడలాడించిన విప్లవ వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. పి.ఒ. జె. పాపా రావు,జి. విష్ణుమూర్తి,పి.హరి, కె. ఉగాది నాయుడు,డి. అనసూయ,బి. శ్రీనుబాబు,కె. కరుణశ్రీ,డి.రమేష్, ఎల్. ఆనంద్,బి. అంజన,విద్యార్థులు పాల్గొన్నారు.

పి వై జి పుట్టుగలో... మండలంలోని పి వై జి పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అల్లూరు సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అల్లూరి వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థి ఆయన చూపిన దేశభక్తి బాటలో అందరూ చైతన్య వంతులై నడవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటిలో... మండల కేంద్రమైన కవిటిలో గల శ్రీ కళ్యాణి

ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బిందు మాధవి,ఏవో రాణి, విద్యార్థులు, అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం టౌన్: నగరంలోని ఎల్ ఐ సి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామ రాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ బివిస్ చక్రవర్తి,ప్రిన్సిపాల్ కె శివ శంకర్ అల్లూరి చిత్రపటానికి పూల మాల వేసి అంజలి ఘటించి అనంతరం మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి ముఖ్య పాత్ర పోషించారన్నారు,గిరిజన ప్రజల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు,ఎన్ ఎస్ ఎస్ పిఓ హరి మానస, లైబ్రేరియన్ కమల్ కుమార్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: మన్యం వీరుడు"అల్లూరి

సీతారామరాజు జీవితం నేటికి మనందరికీ ఆదర్శప్రాయం అని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి కొనియాడారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతి పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గారు స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా మనందరం గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యం దోపిడిని ఎదుర్కోవడానికి గిరిజనలు, బలహీనులు, పేదవారుకు అండగా నిలిచి విప్లవ యోధులుగా తయారుచేసి 27 ఏళ్ల వయసులో కోయ్యూరు మండలంలో మే 7,1924న తెల్లదొర్లకు బందీ కాబడి వీర మరణం పొందిన సమర మహాయోధుడు అల్లూరి సీతారామరాజు అని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర ఉద్యమం సాధన విప్లవం తోనే సాధ్యమవుతుందని భారతదేశానికి చాటిన గొప్ప విప్లవ జ్యోతి సీతారామరాజు నేడు భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన ఉద్యమ పోరాట స్ఫూర్తి మనందరికీ ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి కెవి రమణ, డిఎస్పీ ఎల్.శేషాద్రి, ఏవో సీ.హెచ్ గోపీనాథ్, సిఐలు దేవుల్లు, శ్రీనివాస్, శ్రీను, ఆర్ఐ, నర్సింగరావు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట : కంచిలి మండలం బూరగాం గ్రామంలో స్వాతంత్ర ఉద్యమ నేత, తెల్ల దొరలకు సింహస్వప్నంగా నిలిచి ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకువెళ్లి మాతృభూమి కోసం అసువులు బాసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అనేక మంది ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు బూరగాం గ్రామంలో గల అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశం కోసం సీతారామరాజు అప్పట్లో చేసిన పోరాటాలు ఇప్పటికి కళ్లెదుట కనిపిస్తూనే ఉన్నాయని అన్నారు. అటువంటి మహానుభావుని స్ఫూర్తి నేటి తరానికి ఎంతో అవసరమని అన్నారు. సాహసానికి నిలువెత్తు నిదర్శనమైన అల్లూరి భారతీయుల హృదయాల్లో చిరస్మరణీయుడని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బొడ్డు అప్పారావు, ఎంపీటీసీ మడ్డు వెంకటరావు, సీపీఎం నేత కప్ప గోపినాథ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో నిందితుడు అరెస్టు

- వివాహేతర సంబంధమే హత్యలకు కారణం
- కాశీబుగ్గ డిఎస్పి వి.వెంకట అప్పారావు

విశాలాంధ్ర-పలాస: సభ్య సమాజం తలదించుకునే సంఘటన ఇది. వావి... వరసలు మరిచి వరుసకు అన్న.. భావలతో వివాహేతర సంబంధం పెట్టుకోవడమే ఆమె నిండు నురేళ్ల జీవితం బలి అవ్వడంతో పాటు మరో యువకుడి ప్రాణాలు బలిగొన్నాయి. ఈ జంట హత్యలకు సంబంధించి నిందితుడుని కాశీబుగ్గ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం కాశీబుగ్గ డిఎస్పి వి.వెంకట అప్పారావు డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మే నెల 17న సోంపేట మండలం పాలవలస జాతీయ రహదారి సర్వీసు రోడ్డు ప్రక్కనున్న జీడి తోటల్లో గొకర్ల ఈశ్వరరావు అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ సంఘటనపై బారువ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు జరుగుతుండగా పాలవలస అత్తవారింటిలో ఉంటున్న మందస మండలం పిడిమందస గ్రామానికి చెందిన గొకర్ల రాజేశ్వరి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి మందస పోలీసులకు గత జూన్ 13వ తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై మందస పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఈ నేపధ్యంలో గత నెల 15న మందస మండలం పితాళి గ్రామ పరిధిలో గల జీడి తోటల్లో రాజేశ్వరి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఈ జంట హత్యలు జీడి తోటల్లోనే జరగడంతో ఆ దిశగా మందస, బారువ, సోంపేట పోలీసులు దృష్టిసారించి లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గురైన రాజేశ్వరి భర్త చంద్రశేఖర్ బ్రతుకు తెరువు కోసం కుటుంబాన్ని పోషించేందుకు సౌదీలో వలస కూలీగా పని చేస్తున్నాడు. జంట హత్యల కేసులను సవాల్‌గా తీసుకున్న కాశీబుగ్గ డిఎస్పి వి.వెంకట అప్పారావు నేరస్తులను కనుగోనేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించి దర్యాప్తు చేయించారు. పలాస మండలం మహాదేవుపురం గ్రామానికి చెందిన మడియా రామారావు తరుచుగా రాజేశ్వరి ఇంటికి వెళ్లి వస్తున్నట్లు గుర్తించారు. రామారావు మృతురాలు రాజేశ్వరికి అడపడుచు భర్త. వరసకు అన్నయ్య అవుతాడు. అలాగే హత్యకు గురైన ఈశ్వరరావు అనే యువకుడు పాలవలసలో రాజేశ్వరి ఇంటి ఎదురుగా నివాసముంటున్నాడు. వరుసుకు రాజేశ్వరికి భావ అవుతాడు. ఈ నేపధ్యంలో ఈశ్వరరావు మరియు రామారావులతో రాజేశ్వరి గత రెండున్నరేళ్లుగా ఒకరికి తెలియకుండా ఒకరితో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈశ్వరరావుతో రాజేశ్వరి లైంగిక సంబంధం కలిగి ఉందనే కక్షను పెట్టుకున్న రామారావు పథకం ప్రకారం ఈశ్వరరావును హత్య చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. పాలవలస గ్రామ సంబరాలు జరిపే సమయంలో రామారావు ఈశ్వరరావు ఇద్దరు రోడ్డు ప్రక్కనున్న జీడి తోటల్లో మద్యం సేవించి బీరు సీసాతో ఈశ్వరరావును పొడిచి అతికిరాతకంగా రామారావు హత్య చేశాడు. ఈ హాత్య సంగతి తెలుసుకున్న రాజేశ్వరి తన పేరు ఎక్కడ బయపడుతుందోనని భయంతో పాటు నగదు కావాలని పదేపదే రామారావుపై రాజేశ్వరి ఒత్తిడి తేవడం జరిగింది. ఇవన్ని భవిష్యత్‌లో తనకు ఇబ్బంది కలిగిస్తాయని భావించి రాజేశ్వరిని కూడా హత్య చేసేందుకు మరో ప్రణాళిక వేశాడు రామారావు. గత నెల ఒకటో తేదీన రాజేశ్వరి అత్తవారింటికి పాలవలస వెళ్లేందుకు హరిపురంలో బస్సు ఎక్కిన ఆమె మధ్యలో రాణిగాం బస్టాండ్ వద్ద

దిగిపోయింది. అదే సమయంలో అక్కడకు ద్విచక్ర వాహనంపై రామారావు చేరుకొని ఆమెను వాహనంపై ఎక్కించుకొని పితాళి గ్రామ పరిధిలో గల జీడి తోటల్లోకి తీసుకువెళ్లి తన కోరికను తీర్చుకొని అనంతరం ఆమె చున్నీతో పీక నులిపి హత్య చేశాడు. రాజేశ్వరి ఒంటిపై ఉన్న బంగారం దోచుకొని పరారయ్యాడు. ఈ రెండు హత్యా సంఘటనలపై పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా జరుగుతుండడంతో నిందితుడు గురువారం పితాళి గ్రామ విఆర్‌వో ఎదుట లొంగిపోయాడు. అనంతరం పోలీసులు తమదైన శైలిలో విచారించగా రామారావు చేసిన నేరాలన్నీ అంగీకరించాడని అందుకు బలమైన సాక్షాధారాలు, సిసి పుటేజీలు లభించాయని డిఎస్పి వెంకట అప్పారావు తెలిపారు. నిందితుడు రామారావును శుక్రవారం పలాస జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. ఈ దర్యాప్తులో కాశీబుగ్గ రూరల్ సి.ఐ ఎం.తిరుపతిరావు, సోంపేట సి.ఐ బి.మంగరాజు, మందస ఎస్.ఐ కె.క్రిష్ణప్రసాద్, కానిస్టేబుల్స్ జి.షన్ముఖరావు (సోంపేట), ఎస్.ప్రసాద్ (హిరమండలం), డి.రామారావు (మందస), హెూంగార్డు లక్ష్మణమూర్తి (మందస)లు పాల్గొన్నారని తెలిపారు.

చేసిన సేవలే ఉపాధ్యాయులకు గుర్తింపునిస్తాయి : హెచ్ఎం రవికుమార్

విశాలాంధ్ర-సంతబొమ్మాలి : ప్రతి ఉద్యోగి,ఉపాధ్యాయుని జీవితంలో బదిలీలు సర్వసాధారణమని, పని చేసిన కాలంలో చేసిన సేవలే మంచి గుర్తింపునిస్తాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్ర ప్రధానోపాధ్యా యులు ఎస్.రవికుమార్ అన్నారు. పాఠశాలలో అపూర్వ సేవలందించి బదిలీ కాబడిన పూర్వ ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, ఉపాధ్యా యులు టి.లోకేశ్వర రావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘం నాయకుడు బాడాన రాజు, డి.ఉమాశంకర్, ఎ.వెంకటరెడ్డి, బి.నాగమణి, కె.తవిటిరెడ్డి పి.తిరుపతి రావు లను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎస్.రవికుమార్ మాట్లాడుతూ బదిలీ మీద వెళ్లిన ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యున్నతి కి, పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని, వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు. పూర్వ ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ మాట్లాడుతూ, ఏ పాఠశాలలోనైనా పేద, మధ్యతరగతి విద్యార్థుల అభ్యున్నతి కి కృషి చేసిన ఉపాధ్యాయులు విద్యార్థుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పాఠశాలకు వచ్చే పేద పిల్లల సర్వతోముఖాభివృద్ధి కి తోడ్పడితే దాని ఫలితంగా తమ స్వంత పిల్లల అభివృద్ధి చెందుతారనే భావన ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.రవి కుమార్, పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు టి.లోకేశ్వర రావు, బాడాన రాజు,డి.ఉమా శంకర్, వెంకట రెడ్డి, తవిటి రెడ్డి, నాగమణి, కె.విజయ లక్ష్మి, డి.ఉమాదేవి,కె. బాపూజీ, జి. లోకనాదం, టి.విజయలక్ష్మి, బి.శ్రీనివాసరావు,కె.సుధాకర్, ఎ.శంకర రావు, గని రాజు, శ్రీనివాస్, గోపాల రెడ్డి, కమలా కుమారి, సాయి శివాని, త్రివేణి, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-పలాస : ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకుండా అలాగే



ఉండి పోతున్నాయని, తక్షణమే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం అప్పలరాజు, కార్యదర్శి బెండి గోపి డిమాండ్ చేశారు. శుక్రవారం పలాస ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఏ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. 2019 సర్క్యులర్ అమలుపరచాలన్నారు. డబల్ డ్యూటీ చేసే సిబ్బందికి డిఏ పెంచాలని డిమాండ్ చేశారు. డిప్టేషన్లు బదిలీలపై విల్లింగ్ మేరకు పర్మినెంట్ బదిలీలు ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన బస్సులు, బ్రేక్ డౌన్ అయిన గ్యారేజ్ సిబ్బంది బాధ్యులు కాదన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ సొంతంగా నడపాలి అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు గత ఆరేళ్లుగా పెండింగ్లో ఉన్న ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జగ్గారావు, చాందిని, సంతోష్, ఎల్ ఎం రావు, కిరణ్ కుమార్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ఎనలేని కృషి



విశాలాంధ్ర-పలాస : పలాస ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి పినకాన సంతోష్ కుమార్ అని పలాస ఆర్టీసీ ఎన్ఎంయు నాయకులు అన్నారు. పలాస ఆర్టీసీ డిపోలో శుక్రవారం పలాస నుంచి శ్రీకాకుళం ఆర్టీసీ డిపో 1కు బదిలీ పై వెళ్ళిన పలాస ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పినకాన సంతోష్ కుమార్ కు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు రీజనల్ అధ్యక్షుడు పినకాని వాలి మాట్లాడుతూ సంతోష్ కుమార్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసిన సమయంలో ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా ఆర్టీసీ ఉద్యోగులకు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. అనంతరం సంతోష్ కుమార్ మాట్లాడుతూ పలాస డిపో నుంచి బదిలీ పై వెళ్ళిన జిల్లాలో ఉంటానని, ఎవరికి ఎటువంటి సహాయం కావాలన్న నా వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ప్రతీ ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించి అధికారులకు అండగా ఉంటూ డిపో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ అధికారి జి. రామ్మోహనరావు, ఎన్ఎంయు అధ్యక్షుడు ఎ వి రావు, కార్యదర్శి హెచ్ వి మూర్తి, గ్యారేజ్ కార్యదర్శి డి ఎల్ నారాయణ, పున్నయ్య, డి శ్రీనివాసరావు, వాకనపురి శ్రీనివాసరావు, టి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

టీబీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-పలాస : ప్రతి ఒక్కరూ టీవీ పట్ల అప్రమత్తంగా ఉండాలని పలాస టీవీ యూనిట్ సూపర్ వైజర్ ఎస్ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలం రెంటి కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో లొద్దభద్ర సచివాలయం పరిధిలో టిబి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ టీబీ రోగులకు వ్యాధిపై అవగాహన కల్పించి, వ్యాధి నిర్మూలనకై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటి దుష్ఫలితాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వై. పద్మావతి ,హెల్త్ అసిస్టెంట్ లొడగల కామేశ్వరరావు, ఎం.ఎల్.హెచ్.పి. పి.సుధారాణి, ఆరోగ్య సిబ్బంది ఎం ఝాన్సీ దేవి డిఈఓ వెంకటేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి..

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు పిలుపు

విశాలాంధ్ర-పలాస: దేశంలో కార్మిక వర్గంపై గ్రామైక ప్రజానీకంపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడులకు ప్రతిగా కార్మిక వర్గం తమ హక్కులు పునః సాధనకై ఈ నెల 9న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిందని దీనిని జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారు రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం కాశీబుగ్గలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 11ఏళ్ళ మోడి పాలన శ్రామిక ప్రజలను దురవస్థకు గురిచేసిందని, నిరుద్యోగం, పేదరికం అసమానతలు ఆకాశాన్ని తాకాయని ఈ నేపధ్యంలో వేతనాలు కుదించకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులు సామాజిక రక్షణ అడుగంటిందని,బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత మోడి ప్రభుత్వం ప్రజల జీవితాలు, జీవనోపాధిపై దాడులను ఉధృతం చేసిందన్నారు. కష్టపడి సాధించిన కార్మిక చట్టాలను తొలగించి వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి వాటిని అమలు చేయడానికి పూనుకున్నదని, కార్మిక వర్గానికి ఉన్న అనేక రకాల హక్కులను గ్యారెంటీలను, కనీస వేతనాలను సామాజిక రక్షణలను పని గంటలను ఈ లేబర్ కోడ్ లు కార్మిక వర్గం నుండి గుంజుకున్నాయని ఆరోపించారు.మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రైతాంగ పోరాట ఒత్తిడితో ఉపసంహరించి మరలా ఇప్పుడు దొడ్డి త్రోవన తీసుకురావడాన్ని ప్రయత్నిస్తున్నదని మోడీ ప్రభుత్వం ఇది రైతాంగ భూములను గుంజుకొని కార్పోరేట్లకు కట్టబెట్టడానికి తమ కార్పోరేట్ యజమానుల ప్రయోజనాల కోసం అన్ని శ్రేణుల సాధారణ ప్రజలపై దాడులు చేస్తుందన్నారు. వీటి నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి ప్రజలలో బిజెపి ఆర్ఎస్ఎస్ మతవిద్వేషాలను రెచ్చగొడుతుందని ఇందులో భాగమే ఒక్కొక్క సవరణ చట్టం ఉమ్మడి పౌరస్మృతి ఆపరేషన్ మొదలగునవి శక్తివంతమైన నిత్యయాత్మకమైన ప్రజల ప్రతిఘటన పోరాటాలు నేడు తక్షణ అవసరం సమయానికి స్పందిద్దామని అన్నారు.నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ బిల్లులను ఉపసంహరించి స్మార్ట్ మీటర్ల పథకాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం 41వేల రూపాయిలకై డిమాండ్ చేద్దామన్నారు. నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డుతో సహా అన్ని సంక్షేమ బోర్డులను పునరుద్దరించాలని, 200 రోజుల పనిదినం రూ. 600 ల దినసరి వేతనంతో మహాత్మాగాంధీ ఉపాధి హామి పథకాన్ని పటిష్ఠం చేయాలని డిమాండ్ చేశారు.

కార్పోరేట్లకు అనుకూల రైతు వ్యతిరేక వ్యవసాయ మార్కెట్ విధానాలను రద్దు చేసి మద్దతు ధరను చట్టబద్దం చేసి అమలు చేయాలని, అన్ని అత్యవసర సరుకుల ధరలను తగ్గించి, ఆహారభద్రతను సార్వత్రికం చేయాలని, మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మిక వర్గం తమ హక్కుల సాధనకై ఇచ్చిన సమ్మె పిలుపును సకల శ్రామిక శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ బుగతా బంగార్రాజు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ సీనియర్ నాయకులు కామ్రేడ్ మద్దిల మల్లేశ్వర రావు, జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, అఖిల భారత కిసాన్ మహా సభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు, ఎఐసిసిటీయు జిల్లా నాయకులు కామ్రేడ్ కుత్తుం.దుష్యంత్ రావు, కామ్రేడ్ పోతనపల్లి కామేశ్వరరావు, కామ్రేడ్ పిన్నింటి నాగేశ్వరరావు, ఐప్వా నాయకులు కామ్రేడ్ కోనారి ఈశ్వరమ్మ, జిల్లా నాయకులు పోతనపల్లి అప్పారావు పాల్గొన్నారు.

పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలి

- మొక్కలు నాటి రక్షణ ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: మొక్కలు నాటి సంరక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డ్వామా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనుల పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి, పంచాయతీ రహదారులు వెంట మొక్కలు నాటి వాటికి సంరక్షణ చేయాలన్నారు. టెక్కలిలో జంగిల్ క్లియరెన్స్ చేసి మొక్కలు నాటినట్లు మండలాల్లో కూడ్ జంగిల్ క్లియరెన్స్ చేసి మొక్కలు నాటాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు, ఉద్యానవన శాఖకు సంబంధించిన సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ఉపాధి హామీ పనులను ఆయా మండలాల్లో సరిపోయిన పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. చేపల విరామ సమయంలో మత్స్యకారులకు జాబ్ జారీ చేసింది లేనిది అడిగి తెలుసుకున్నారు. చెరువు పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. వేతనదారులకు కనీస వేతనం గూర్చి అడిగి తెలుసుకున్నారు. చెత్త కుండీలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకుడు గోతులు త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం పిడి బి. సుధాకర్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎవరికి నిర్ణయించిన పనులు వారు సత్వరమే నిర్వహించి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి బి. సుధాకర్, ఎపిడిలు వి. రాధ, శైలజ, శ్రీనివాసరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి బి. లవరాజు, ఫీల్డ్ ఆఫీసర్లు, డ్వామా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.